కథా నిలయం
శ్రీకాకుళం

# ఉన్నతాశయాలు

జగన్నాధరావు భోజనముచేసి ఆఫీసుకు బయలుదేరాడు. సరోజని చంద్రవంకలా నోరుపెట్టి ముద్దుగా చిన్నపిల్లలా 'సాయంకాలము ఆరు గంటల వరకూ ఈ ఇంటిలో నే నొక్కర్తైనా ఉండలేను బాబూ' అంది గోముచేస్తూ. 'పోనీ ఆఫీసుకు వస్తావేమిటీ' అన్నాడు పగలబడి నవ్వుతూ. 'ఆఫీసుకు వచ్చేట్టయితే అలా అననే అనరు' అని మొగం మల్లెమొగ్గలా ముడిచింది. జగన్నాధ్—'పోనీ... మూడుగంటలకు టిఫిన్ తీసుకోవటానికి రానా ఏమిటి' అన్నాడామె చెక్కులు నిమురుతూ కళ్ళలో కళ్ళుపెట్టి. 'నిజంగానా' అంది ఎంతో ఔత్సుకతతో. 'ఆ...కాని. ఆ కాస్సేపటిలో నీ వంటరితనం తీరిపోతుందా ఏమిటి' అని నవ్వుతూ ప్రశ్నించినట్టుగా ముద్దు పెట్టుకున్నాడు. 'పోనీ రావడం మానెయ్యండి. నేను రమ్మంటే వస్తారా ఏమిటి? ఇంతకీ మీరేగా వస్తానంది. త్రవ్వుకోవడమూ మీరే, పూడ్చుకోవడమూ మీరే' అంది. 'అరే టైము చాలా అయింది. నేనిక పోతా. మూడు నాలుగు గంటల మధ్య వస్తా. ఏమి

పెడతావో చూస్తానుగా' అంటూ గుమ్మంలోకి వెళ్ళిపోయాడు. ఆమె అతని వెనకాలే, విరిసిన మల్లెపూవులా నవ్వుతూ నడిచి వెళ్ళింది. ఆతను వెళ్ళిపోయాడు. ఆమె తలుపులు దగ్గఱగా వేసి ఇంట్లోనికి వచ్చివేసింది. సరోజనికి గంటలు గడవటం కష్ట మయింది. ఫలహారం ఏమి చెయ్యాలో కాస్సే పాలోచించింది. చేయవలసిన వాటిని రెండింటికి ఆరంభించాలని నిర్ణయించు కుంది. తను భోజనము చేసింది. మనుచరిత్ర తీసి ప్రవరాఖ్యుని 'మిన్నులు పడ్డచోట' విడచి ఇక చదవటం విరమించుకుంది. ఆనాటి దిన పత్రికలో వ్రాసిఉన్న శీర్షికలు—ఆంధ్రరాష్ట్రం వస్తుంది— చెన్నపట్నాన్ని కట్నంగా యిస్తే; అట్లాంటిక్ ఒడం బడికతో మూడో యుద్ధం ముంచుకొచ్చినట్లె; విచిత్రమైన శిశువు పుట్టింది; నెహ్రూ పిల్లలతో రేడియోలో ఆడు కుంటున్నాడు; మద్రాసులో మంత్రులు ఐకమత్యంకోసం ప్రయ త్నిస్తున్నారు; పట్టపగలే దొంగతనం; రేడియో ప్రోగ్రాములు; వాతావరణం చదివి పేపరు పారేసింది. ఉక్కగా ఉంటే చీర మార్చి పల్చనిచీర కట్టింది. జాకెట్టుతీసేసి బాడీ ఒక్కటే ఉంచు కుంది. అప్పటికీ ఉడకబెడుతూవుంటే విసనకర్ర తీసివిసురుకుంది. మంచంమీద వ్రాలి పడుకుంది. వెచ్చనిగాలి కొడుతూవుంటే వీధి వెంపు కిటికీ మూసి వేసింది. విసనకర్రమీద నీళ్ళుచల్లి విసురుకుంది. చల్లగా ఆ నీటితుంపరలు పడుతూవుంటే హాయిగా నిద్రపోయింది. కాని మాయదారి ఉక్క ఎంతసేపు నిద్ర పోనిస్తుంది? ఆమె ఒంటినిండా చెమ్మటలు పోసినవి. ఆ ఉక్క

పోతలో గాలికోసము ఇటునుంచి అటు కదలి విసన కర్ర కోసము చేయిచాచి అది అందకపోగా కళ్లు తెరచి చూచేసరికి గడియారం మూడు-అయిదు నిమిషాలు చూపింది. గభాలున ఆమె మంచంమీదనుంచి లేవబోయేసరికి వీధితలుపు చప్పున తెరచుకొని ఒక మనిషి ప్రవేశముతో చప్పున మూసుక పోయింది.

ఎవరా మనిషి ?...

బుష్‌కోటులో, మడత నలగని చక్కని ఫేంటులో, బూటులో పొడుగ్గా నిలుచున్న ఆ ఎఱ్ఱని యువకుడు—నల్లని కళ్ళద్దాలతో, అంతకన్నా నల్లని వంకీల జుట్టుతో...ఎవరతను ?

ఆమె ఏదో మాట్లాడబోయింది. 'వారులేరు' అనబోయి ఆమె పెదవులు అనకుండానే అట్లా చలించి ఊరుకున్నాయి. అతను తలుపు గడియ వేస్తున్నాడు. ఆమె గుండెలు శిథిలమై పోయాయి. ఆమె బిక్కచచ్చిపోయినది. ఆమె కనులు తిరిగినవి.

ఆ వచ్చినమనిషి 'మీారేమీా భయపడకండి' అన్నాడు.

అలాగని ఆమెవైపు మామూలు చూపులతో చూచి, 'మీారు గట్టిగా మాట్లాడ టానికిమాత్రం ప్రయత్నించకండి. ఇక నా బారినుండి మీారేమాత్రమూ తప్పించుకోలేరు. అం చాత మీాదగ్గరవున్న వస్తువులు త్వరగా ఇలా పారెయ్యండి. అదిగో మీారేదో ఊహిస్తున్నట్టున్నారు. మీారు గొడవచేస్తే

అంతా వచ్చి నన్ను పట్టుకుంటారని కాబోలు. సరిగ్గా చూడండి నన్ను. నన్నెవ్వరూ దొంగననుకోరు. అంతేకాదు. మీ శీలాన్ని శంకిస్తారుకూడ. అందుకనే, నేను ఎవ్వరూ చూడకుండా, జాగ్రత్తగా ఈ ఇంట్లో ప్రవేశించాను. మీరా వస్తువులు ఇచ్చేస్తే త్వరగా వెళ్లిపోతాను. 'పట్టపగలు వస్తువు లెలా పోయా'యని ఎవరైనా అడుగుతారని మీకు బెంగగా ఉంది కదూ. అందుకు నేను వెళ్లిపోయే టప్పుడు మిమ్మల్ని బంధించి వెళ్లిపోతాను. ఇక పొరపాటునగూడ 'దొంగ ఎలా ఉంటాడని' మీ వాళ్ళడిగి నప్పుడు నే నెలాగున్నానో అలాగే మరచిపోయి వర్ణించేరుగాక. అలా చేశారంటే మిమ్మల్ని ఎవ్వరూ నమ్మరు. ఒకవేళ మీ ఆయన అనుమానస్తుడైతే మిమ్మల్ని తప్పక అపార్థం చేసుకుంటాడు. అంచేత మీరు దొంగ ఎలా ఉంటాడని అడిగినప్పుడు, నల్లగా, పొట్టిగా, స్ఫోటకపు మచ్చల మొగంతో భయంకరమైన నేత్రాలతో ఉన్నాడని చెప్పండి. వస్తువు లివ్వకపోతే చంపేస్తానని, బెదిరించి, మిమ్మల్ని వెంటనే కట్టివేసి కత్తి చూపించి గట్టిగా మాట్లాడకుండా ఉండేందుకు నోరు కట్టేసి వస్తువులు తీసుకొని పారిపోయాడని చెప్పండి. మీకప్పుడే అపాయమూ రాదు. ఊ. ఇంక అలస్యం చేయక ఆ వస్తువులు ఇచ్చివేయండి. మీ రీ రోజు పత్రికల్లో సరిగ్గా ఈ విషయాలే 'పట్టపగలే దొంగతనం' అన్న శీర్షికక్రింద చదివి ఉంటారు. అంచాత మీరొక్క రేనని ఇదయి పోవలసిన అవసరంలేదు.'

'గట్టిగా అరిస్తే నావద్ద ఉండే కత్తి, పిస్తోలు ఇత్యాది ఆయుధాల సాక్ష్యంవల్ల నేను పట్టుబడవచ్చని ఊహిస్తున్నా రేమొ. నావద్ద అలాంటి వేమీలేవు. నావద్ద అత్తరు పరిమళాలు మాత్రం గుబాళిస్తున్నాయి.'

'ఒక్కసారిగా మీకా వంటిమీది వస్తువులు తీసి ఇవ్వడం కష్టంగానే ఉంటుంది. కాని ఇవ్వడం మాత్రం తప్పుతుందని అనుకోకండి. ఇక ఏమాత్రం ఆలస్యంచేయక అవి అక్కడ పెట్టండి. అవి నాచేతులతో తీసే పరిస్థితి మాత్రం తెచ్చి పెట్టుకోకండి. ఈ దేశంలో నగలకోసం వగలుచెందే మగువల కెంతో తెగువ వస్తేనేగాని వారూ, ఈ దేశం ఎప్పుడూ ఈ ప్రపంచంలో వెనుకబడే ఉంటారు. ఈ ఆడవాళ్లు బంగా రాన్నంతా తమవద్ద కుదువ ఉంచుకుని, ప్రజా శ్రేయస్సును పాటించక, తమనూ తమ సంతతిని శాశ్వతంగా నాశనం చేసు కుంటున్నారు. ఇలా, ఇంతింతలేసి బంగారవునిధులు మీమెడల్లో మూలుగుతుండడంవల్ల ఏమీ లాభంలేదు. వాటితో యంత్ర సామగ్రి సంపాదించి మన దేశాన్ని పారిశ్రామికంగా మాంఛి ఉన్నతస్థితికి తీసుక రావాలి. వివిధ శాస్త్రాలను చదవటానికి మనవాళ్ళను పరదేశాలు పంపాలి. ఎన్నో ప్రాజక్టులు కట్టాలి. ఆటంబాంబు తాతల్ని మనమే కనిపెట్టాలి. ప్రపంచంలో మనల్ని మించినవాళ్లింక ఎవరూ ఉండ టానికి వీల్లేకుండా చెయ్యాలి. ఇవన్నీ జరగాలంటే మరి ధనం కావాలి. వట్టి కాగితాల కట్టలు పనికివస్తాయని తలచ

కండి. ఎంత వెండి బంగారాలుంటే అంత తొందరగా మన పని సాగించుకోవచ్చు. అదిగో మీరు ఆలస్యం చేస్తున్నారు. ఇంక ఇచ్చెయ్యక తప్పదు. ఈవేళకు ఎవరైనా వస్తారని మీరు ఎదురు చూస్తున్నారేమో. అలా వచ్చినా నేను తప్పించుకో గలను. ఇంతకీ మీ ఆయన సాయంకాలము ఆరుగంటలకు కాని రాడు. అయినా నేను తొందఱగా పోవాలి. చేయ వలసిన కార్యక్రమము బోలెడంత ఉంది. మీరు ఇక ఆలస్యం చేయకండి. ఇలా దొంగతనంగా అడగటం గుఱించి మీరు నన్ను తక్కువగా చూడకండి. దేశములో నిజాయితీ చచ్చి పోయింది. ఇలాంటి ఉన్నతాశయాలతో పనిచేస్తున్నాను— సోదరుల్లారా దయచేసి చందా లివ్వండి అంటే ఒక్క దమ్మిడీ రాలదు. కాని మంత్రిగారు ఈవూరు వచ్చారంటే వారి స్వంత ఖర్చులకు మనీపర్సులు బహుమతులుగా దొర్లుతాయి. మరి అందుకనే ఇట్టిపని చేయవలసి వస్తూంది. మీరందుకనే మీరు మీ ధర్మాన్ని నిర్వర్తించవలసిందిగా కోరుతున్నాను. మీ ఆ వస్తువులు ఎప్పుడు దేశానికి సేవచేస్తామా అని ఆతురత చెందు తున్నాయి. మీ మెడలో బానిసలుగాఉండటానికి అసహ్యించు కుంటున్నాయి. వాటిని విచ్చలవిడిగా వదిలెయ్యండి. అవి దేశానికెంత సేవ చెయ్యగలవో మీకే తెలుస్తుంది. వాటిలో ఎట్టిశక్తి నిద్రావస్థలో ఉండిపోయిందో మీకే గోచరిస్తుంది." అని అతను అంటూఉండగా...

ఇంతలో తలుపు చప్పుడయింది.

'అరే! ఎవరో వస్తున్నారు. ఎంత పని జరిగింది. సరే. మరేమీ ఫరవాలేదు' అని అనుకుంటూ ఆయువకుడు గబాలున తలుపుతీసి—

'అబ్బా! ఈఊళ్ళో ఎలాంటి ఆడవాళ్ళున్నారు.' అని జగన్నాధరావు లోనికి రాగానే, 'ఛీ ఛీ. ఇంత చండాలపు ఊరును నే నెక్కడా చూడలేదు. వీధిలో వెళ్లిపొయ్యేవాళ్ళని పనిమీదుగా పిలవడం తలుపు బంధించడం— ఇంత నీచస్థితికి ఈఊరు వస్తుందని నేనెప్పుడూ అనుకోలేదు. ఏమండీ, మీరో ముసలమ్మనైనా ఈ ఇంట్లో ఉంచుకొని ఉంటే— మీఆడవాళ్లకు ఇలాంటి బుద్ధులు పుట్టి ఉండవు. అందుకనే మనవాళ్లు ఆడవాళ్ళను ఒంటరిగా విడచిపెట్టవద్దన్నారు. వాళ్ళబుద్ధులు విపరీతాలు. వాళ్ళకి ఇది తప్పు, ఇది ఒప్పు అనేవి తట్టవు. ఇంత పిశాచహృదయము గలవా రీ ప్రపంచంలో ఒక్క ఆడవాళ్ళే! నిజంగా మీరు రావడంవల్ల బ్రదికి పోయాను. ఆడది దేనికైనా తెగిస్తుంది. అసలు మగవాని చేతిలో ఏ శక్తి ఉందండీ నెగ్గడానికి. ఆమెకు మీరంటే చాల భయంలా కనిపిస్తూంది. ఒకవేళ ఆమెకిది క్రొత్తపమో! ఏది ఏమైనా ఆమెను సరిగా కాపాడుకోవలసిన బాధ్యత పూర్తిగా మీమీద ఉంది. ఇక నే వెళ్తాను. ఆమె ఇక ఇప్పుడు మీతో ఏమీ మాట్లాడదు లెండి. ఇంతకీ ఆ భగవంతుని దయవల్ల ఎట్టి పాప కార్యము జరుగలేదు. 'కలంచునే సతుల మాయల్ ధీర చిత్తంబులన్' అని నిజంగా కలలో కూడ అనుకోని సంఘటన

ఇది. ఆనాడు ప్రవరాఖ్యునికి ఉన్నశక్తి తిరిగి ఈనాడు ఇట్టి
సమయంలో, ప్రసాదించి రక్షించినందుకు భగవంతునికి నే
నెంతయు కృతజ్ఞుణ్ణి. ఇంతకీ మీరామెను ఏమైనా చేశారుగాక.
బహుశా ఈ వేసవిలో ఆమె చిత్తం కొంచెం స్వాధీనం తప్పిం
దేమో. ప్రప్రథమముననే ఇలా బయటపడిపోయిన ఆమె
ప్రణయ రహస్యం మొదట్లోనే విషవృక్షాన్ని ప్రేళ్ళతో పీకి
వేసినట్లయింది. ఇకామె ఇలాంటి పనులు చస్తే చెయ్యదు.'
అంటూ, అతను పోబోతూవుంటే, జగన్నాధరావు ఆతనివైపు
ఆశ్చర్యంతో చూశాడు. చూసి, 'ఏమిటి! మాసరోజని
అంతపని చేసిందా? నేను నమ్మను. నిజం తేల్చుకోకుండా
నేను మిమ్మల్ని విడువను. ఆమెచేతనే చెప్పించండి ఇంతపని
చేసినట్టు. నేను తప్పక క్షమిస్తాను. ఆమె నోటివెంట పలికిం
పించండి. ఎంతఘోరం! నా సరోజని ఇలా చెయ్యదు. చెప్పు
సరోజని. నీ వితన్ని పిలిచావా?... ... ... ...

సరోజని నిద్రలేచిన తరువాత ఎలా నిలబడిందో అప్పటి
నుంచీ అలాగే కొయ్యబారిపోయి ఉంది. ఆమె తన భర్త
వచ్చిన తరువాత ఆమాత్రంకూడ నిలబడి ఉండలేకపోయింది.
అంతకు ముందే ఆమె కనులవెంట కారిన నీళ్ళు చారికలు కట్టి
నవి. ఇక ఈమాటలు వినగనే ఆమె ప్రాణములు పటుత్వము
తప్పి ఆమెనుండి జారిపోయినట్లయినది. ఆమె ఒక్కసారి
ముద్దగా కూలిపోయినది. గబగబా, జగన్నాధరావు సరోజని
ముఖంమీద నీళ్ళు దగ్గఱలోనే ఉంటే అవి చల్లి, ఆ వచ్చిన

పెద్దమనిషిని 'ఇలా రండీ చచ్చిపోయినట్లుంది' అని పిలచి 'అయ్యో నా సరోజిని నిజం చెప్పకుండానే చనిపోయింది. కాదు పాపిష్ఠి సరోజని చచ్చిపోయింది. అరే కదల్తోంది చచ్చిపోలేదు. అబ్బ! ఈ హృదయంలో అసలు ఏమూలైనా అనుమానపు రేఖలనేవి అణిగి ఉంటే అవి నేటితో రూపుమాసినట్టే. నిజంగా మీరు మహానుభావులండీ! మీ మూలాన నా సరోజని సరి యైనదని ఇవ్వాళ రూఢి అయింది. ఇక మీకు నిలువు దోపిడీ ఇచ్చుకున్నా కష్టం ఉండదు! అసలు మీరు ఈ ఇంటిలోకి ప్రవేశించినప్పుడు, మిమ్మల్ని నేను చూశాను. అది మీరు గమనించలేదు. వెంటనే నాకు మా ఆవిడమీద నిజంగా మీ రన్నట్టుగా గట్టి అనుమానం కలిగింది. అంచాత మీరు ఏమి మాట్లాడుకుంటారో పూర్తిగా విని మరీ మిమ్మల్నిద్దటినీ పట్టు కుని చేయవలసిందేదో చేసెయ్యాలని కాలి జోళ్ళు అరుగు క్రిందనే విడిచిపెట్టి, మెల్లగా అరుగుమీదికి ప్రాకాను. మీరు చెప్పినదంతా విన్నాను. అదంతా ఎంత అద్భుతంగా వుంది! నిజంగా చాల స్వాభావికమైన మీ కల్పనకు, అద్భుత నటనా చాతుర్యానికి నే నచ్చెరవు చెందని నిముసము లేదు. అందులో మీ గుండె నిబ్బరానికి మరీ వింత కలిగింది. ఇంత ధైర్యం ఎవ్వరి కుంటుంది! ఆ పైన మీ ఉన్నతాశయాలు వినేసరికి ఒళ్ళు గగుర్పొడిచింది. ఛీ! వెధవ ఉద్యోగాలనిపించింది. దేశాన్ని బాగుచెయ్యటానికి అవెందుకు పనికివస్తాయి? అప్పుడే మీతో చేయి చేయి కలపాలని ఊహ పొడచూపింది. 'ఇంతకీ ఇది నేర

వేరుతుందో లేదో!' అని అనుకుంటూ మీ ముక్కలు వింటూ ఉండగా 'ఎవరైనా వస్తారని ఎదురు చూస్తూన్నారేమో, అలా వచ్చినా నేనుతప్పించుకోగలను' అన్న మీముక్కలు విన్నాను. మీరప్పుడు ఏవిధంగా మాట్లాడుతారో చూడాలని కుతూహలం కలిగింది. అందుకోసం మరి కొంచెంసేపు కనిపెట్టుకుని కూర్చున్నా. ఈ బంగారంలో పొదగబడిఉన్న అద్భుత శక్తిని అంత చక్కగా మీరు విశదీకరించినా వట్టి తేభ్యంలా, మాటా మంతీలేక ఉన్న మా ఆవిడ ఇక మీకు తన మై వస్తువులను త్యాగం చెయ్యలేదనే ఉద్దేశ్యం గట్టిపడి, గట్టిగా తలుపు త్రోశాను. వెంటనే మీరు తలుపు తెరుస్తూ ఉపన్యసించిన విషయాలకు ఆ వాగ్ధాటికి ఇంతకథ తెలిసిన నేను ఎంత సంతోషించి ఉంటానో మీరు గ్రహించియే ఉంటారు. అయినా అప్పుడు మా ఆవిడ ధైర్యం పరీక్ష చేయాలనే కుతూహలం కలిగి సరోజని అలాంటిది కాదు. నేను నమ్మను అని ఆమెకు ధైర్యం ఎక్కించి చూశాను. నిజం తేల్చుకోకుండా మిమ్మల్ని విడచిపెట్టను అని, ఆమెను తప్పక క్షమిస్తానని ఎంత పురెక్కించి చూసినా ఆమె మాట్లాడనే లేకపోయింది. ఆమె ధైర్యం అంత ఇదిగా తగల బడింది. చివరికి క్రిందబడింది. అదే సమయములో మీరు వెళ్ళిపోతారేమో అని మిమ్మల్ని పిలిచాను. మా ఆవిడ గుండెనిబ్బరం ఇక తెలిసిపోయింది. ఈ కాస్సేపటిలోను, తలుపు చాటునుంచి విని, మీ విద్య నేర్చుకుని, మా ఆవిడను పరీక్ష చేసుకున్న ఈ మీ ఏకలవ్యశిష్యుణ్ణి క్షమించండి. అలా ఆమె ధైర్యాన్ని పరీక్షచేసి మీతో ఇక అనుమానం లేకుండా

చేసుకున్నాను అని అన్నందుకుకూడ నన్ను క్షమించండి. ఆ విధంగా అనకపోతే ఇదంతా చెప్పటానికి ఆస్కారంలేదు. మీరు నాయందు పరిపూర్ణ కటాక్షముంచి నన్ను మీశిష్యునిగా మాత్రం చేసుకోవాలని ప్రార్థిస్తూ యున్నాను. నాదేశం కోసం నన్నుకూడా పాటుపడ నివ్వండి. నేనుకూడ అందుకు ప్రాణాలు అర్పించ సిద్ధంగా ఉన్నాను. ఇదిగో ఇప్పుడే నాఉద్యోగానికి రాజీనామా దాఖలు చేస్తున్నాను. మనంచేసేది మొట్టమొదట ప్రజలు హర్షించక పోవచ్చు. కాని చివరికి దాని అనంతమైన సద్యః ఫలితాలను కాంచి తప్పక ఆశ్చర్యపడకపోరు. ఇక మీరీ వస్తువులను స్వీకరించాలి' అంటూ భార్య మెడలోని నగలనుతీసి అతని చేతులలో పెట్టేసరికి, అతను 'నిజంగా మీవంటివారు దేశానికి కావాలండి. మీరు తప్పక సాయంకాలము మన వాళ్ళంతా సమావేశ మయ్యే స్వతంత్రా భవనంలోనికి హాజరు కావాలని కోరుతున్నా. ఇవ్వాళ నాకు చాల ఆనందంగావుంది. మీవంటి ఉదార స్వభావులు నాకెక్కడా కనుపించలేదు. మీవలె పరిస్థితులను అవగాహన చేసుకో గల్గినవారూ కనిపించలేదు.' అని అత నంటూవుంటే జగన్నాథరావు 'ఎంతమాటన్నారు. మిమ్మల్ని నేనింకా ఎక్కడ కలుసుకోవలసి ఉంటుందో అడగాలని అనుకుంటూ వుంటే, నామీదఉన్న అవ్యాజమైన ప్రేమచే మీరే, అడుగకుండానే చెప్పి ఎంతో ఉదారతను ప్రదర్శించారు. నేను తప్పక అక్కడకు హాజరౌతాను.' అని అంటూ అతన్ని గుమ్మంలోనికి సాగనంపేటప్పటికి ఎర్రటోపీలు కత్తులున్న తుపాకీలు అతని కెదురయ్యాయి. అతని మొగములోని రక్తము నీరైపోయినది.

పోలీసులు వెంటనేవచ్చి అతన్ని అరెష్టుచేశారు. వెనువెంటనే అతను 'ఏమిటిది' అన్నాడు. మీరు దొంగతనం చేశారని, పోలీసులు వినయముట్టి పడేట్టుగా ఆతనికి, అతని జేబులోని వస్తువులను చూపారు.

అప్పుడే జగన్నాథరావు అయ్యా మీకొక్కటి ఇందాక చెప్పడం మరచిపోయాను. మొట్టమొదట మిమ్మల్ని చూడగానే ఈ మెళ్లెక్కి చూచాయగా తెలుసుకున్న నేను ఈ ప్రక్కయింటిలో ఉన్న ఫోనులో మాట్లాడి ఈ పోలీసులను కూడ రప్పించాను. మిమ్మల్ని ఒక్కళ్ళనే పట్టుకుంటే లాభం లేదు; మీ బృందాన్నికూడ పట్టుకోవాలని ఈ ఎత్తువేశాం. క్షమించండి. ఈవిషయం చెప్పడం మరచిపోయాను. అనేసరికి 'ఎంతపనిచేశారు. ఎట్టి ఉన్నతాశయాలను నాశనంచేశారు. నిజంగా మీవంటి దేశద్రోహి ఉండబోడు. అభ్యుదయ శక్తుల్ని అరికట్టచూస్తున్న మీరు ఈ ప్రపంచంలో ఉండి దేనికి? విశాల దృక్పథములేని మిమ్మల్ని గురించి ఎంత విచారించాలో తోచడంలేదు. మీదృష్టికి మా ఊహాల ఔన్నత్యం అందినా అందకపోయినా ఈ మాటమాత్రం జ్ఞాపకం ఉంచుకోండి. ఏ ఉన్నతాశయాలతో ఈ ఉద్యమం సాగిస్తున్నామో, ఆ ఉన్నతాశయాలకోసం ఇవ్వాళ జైలుకు పోయినా మాతోపాటు అవీ నిర్బంధించబడే ఉంటాయని మాత్రం ఊహించకండి. జైలులోంచి ఎల్లాగైన అవి బయటపడి వాటిపని నవి సాధించక మానవు.' అని అతను తన హృదయావేదనను వెళ్ళగక్కుతూవుంటే, జగన్నాథరావు 'చింతచచ్చినా పులుపు చావదు' అని సరోజనివైపు, చూచాడు.

——